## క్లుప్తంగా

### ఫుట్‌బాల్ కోచ్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వైఎఫ్‌సీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ కోచ్ మాబుసాబ్‌కు మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ క్లబ్ (వైఎఫ్‌సీ) సభ్యులు, సీనియర్ క్రీడాకారులు రూ.1.05 లక్షల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. పట్టణంలో ఎంతోమందిని ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన కోచ్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న సభ్యులు ఆర్థిక సహాయం అందించడమే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎఫ్‌సీ సభ్యులు విక్రమ్, పెద్ద ఈరన్న, ప్రసాద్, ముని, శ్రీనివాసరెడ్డి, హనీఫ్, లతీఫ్, తదితరులు ఉన్నారు.

### తుంగభద్ర ప్రాజెక్ట్ డీఏఓగా మాధవరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవరెడ్డి

ఆదోని అర్బన్: తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్ట్ ఆదోని డివిజనల్ అకౌంట్ అధికారిగా సీహెచ్ మాధవరెడ్డిని నియమిస్తూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మాధవరెడ్డి కోసిగి ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేశారు. ఉన్నతాధికారులు పదోన్నతి కల్పిస్తూ ఆదోని తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు డీఏఓగా నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

### క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



కోయిలకొండలో అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ గజేంద్రారెడ్డి

కృష్ణగిరి: పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఎంపీహెచ్ఈఓ గజేంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో బుధవారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, బాలింతలకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. టీకాలు సకాలంలో వేయించకపోతే వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధి నిరోధక టీకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులతోపాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### జీడీపీ పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జల వనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషాకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు సిటీ: గాజులదిన్నె ప్రాజెక్టు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ కోరారు. ఈ మేరకు వారు బుధవారం జల వనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏకైక సాగు నీటి ప్రాజెక్టు(దామోదరం సంజీవయ్య సాగర్)అని, ఆ ప్రాజెక్టు మరమ్మతుల పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. లేకపోతే అధిక వర్షాలు కురిసి వరద నీరు భారీగా చేరితే ప్రాజెక్టు భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. జీడీపీ ద్వారా కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీరు అందించాల్సి ఉందన్నారు.

### సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టిని పురస్కరించుకొని బుధవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహామంగళహారతి చేపట్టారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులను హోమశాల వద్ద కొలువుంచి హోమములు తదితర కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ, అన్నదానం చేశారు.

# బడి పిలుస్తోంది

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు
- ముగిసిన వేసవి సెలవులు



అలువాల పాఠశాల గోడలకు పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు వేసిన దృశ్యం



ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల

ఆదోని సెంట్రల్/గోనెగండ్ల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. వారికి కావలసిన విద్యాసామగ్రి కొనుగోలు చేయడంలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. ఒకప్పుడు సర్కారు బడి అంటే.. చిల్లులు పడిన స్లాబ్‌లు.. ఊడిపోయిన తలుపులు, చెట్ల కింద చదువులు, అధ్వానంగా మరుగుదొడ్లు, నీటితో నిండిన క్రీడా ప్రాంగణాలు. ఇలా అన్నీ సమస్యలే. అందుకే ఫీజులు భారమైనా ప్రైవేట్ స్కూళ్లలో చదివించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపేవారు. ఇప్పుడా పరిస్థితులు మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో స్కూళ్ల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా నాడు–నేడు కింద అన్ని హంగులూ కల్పించడం, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో కేవలం పేదలే గాకుండా మధ్యతరగతి వారు సైతం తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడానికి ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారం ఉపాధ్యాయులు స్కూళ్లను శుభ్రపరచి ముస్తాబు చేశారు.

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక పాఠశాలలు 132 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 29 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతికి, ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి పబ్లిక్ ఫలితాల్లో ప్రభుత్వ బడులలో చదివిన విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధించారు. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో సాధించిన ఫలితాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ అడ్మిషన్ చేసేలా కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో సైతం పిల్లలు బడులలో చేరేవిధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలతో పాటు, విద్యాప్రమాణాలు మెరుగుపరిచే విధంగా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర సామగ్రిని అందిస్తోందని, అలాగే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తామని హామీ ఇస్తున్నారు. తద్వారా విద్యార్థులు ప్రభుత్వ బడులలో చేరే విధంగా కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

#### పాఠశాలల్లో అడ్మిషన్లు



నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. అడ్మిషన్లను కూడా నేటి నుంచి ప్రారంభిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ప్రైవేట్ బడులకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీనివాసులు, మండల విద్యాధికారి–2, ఆదోని

#### ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్ల కంటే ఎంతో మిన్నగా ఉన్నాయి. అన్ని వసతులను ప్రభుత్వం కల్పించింది. సరిపడా మైదానాలు ఉన్నాయి. శుద్ధీకరించిన తాగు నీరు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి.– నీలకంఠ, ఎంఈఓ–2, గోనెగండ్ల

### సబ్సిడీ విత్తనాల పంపిణీ

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారికి విత్తనాలను అందజేసినట్లు చెప్పారు. వేరుశనగ విత్తనాలు 142 క్వింటాళ్లు, జీలుగ 8 క్వింటాళ్లు, పిల్లిపెసర 1 క్వింటం విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి పొలాల్లో విత్తుకోవాలని, లూజు విత్తనాలను కొని మోసపోవద్దని సూచించారు.

### ఘనంగా అఘోర స్వామి ప్రభోత్సవం



మల్లెపల్లిలో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామంలో అఘోర స్వామి తిరునాల సందర్భంగా బుధవారం ప్రభోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని ప్రభపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# పొలం బడి.. నూతన ఒరవడి



విత్తనాలను కలుపుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



పంటలో దెంతిక ఎలా పట్టాలో వివరిస్తున్న సిబ్బంది (ఫైల్)



వేరుశనగ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరిస్తున్న దృశ్యం (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పంటల సాగులో రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ శాఖ పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తోంది. విత్తనం విత్తడం మొదలుకుని పంట దిగుబడులు పొందే వరకు అడుగడుగునా రైతులకు సలహాలు, సూచనలు చేస్తూ వారిలో అవగాహన పెంచుతోంది. తక్కువ ఖర్చుతో నాణ్యత కలిగిన అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు పంటల సాగులో తగిన మెలకువలను రైతన్నలకు వివరించి వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు.

**ఎంపిక చేసిన గ్రామాల్లో....**

మండలంలో ఎంపిక చేసిన కోటేకల్, కడిమెట్ల గ్రామాల్లో మంగళ, శుక్రవారాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పొలం బడి కార్యక్రమాలను నిర్వహించి రైతులకు పంటల సాగులో మెలకువలు, సూచనలు ఇచ్చారు. భూసార పరీక్షలు చేయించడం వాటి ఫలితాల అనుగుణంగా ఖరీఫ్‌లో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలి, పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై కూడా రైతులకు వ్యవసాయ సహాయకులు వివరిస్తున్నారు.

**అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం**

వ్యవసాయాధికారులు రైతులకు పంటల సాగులో మెలకువలు తెలియజేసి అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన పద్ధతులను వివరిస్తారు. అలాగే పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని మేలైన దిగుబడులు సాధించే దిశగా పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, రాయితీలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి మిత్ర పురుగుల సంరక్షణ, సేంద్రియ ఎరువుల వాడకం పెంచేలా కృషి చేస్తున్నారు.

**రైతు భరోసా కేంద్రాల సేవలు**

మండలంలో రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు ఉపయోగించుకుంటున్నారు. విత్తనం నాటిన నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతుకు కావాలిసిన పూర్తి సహాయం అందించేందుకు రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అలాగే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు పరికరాలను అందిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

#### సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన



రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచేలా అవగాహనలు కల్పిస్తున్నాం. అలాగే ప్రభుత్వం సబ్సిడీ కింద రైతులకు అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు వంటి వాటి గురించి వివరిస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– మహేశ్వరరెడ్డి, మండల వ్యవసాయధికారి, ఎమ్మిగనూరు

## పాఠశాలలకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



కోసిగి నుంచి ఆటోలో పాఠ్య పుస్తకాలు, బ్యాగులను పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయిలకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓలు మొయినుద్దీన్, నాగేశప్ప

కోసిగి: 2024–2025 విద్యా సంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కానుంది. నేడు పాఠశాలలు తెరచుకోనున్న నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులను ఎంఈఓ–1 మెయినుద్దీన్, ఎంఈఓ–2 నాగేశప్ప ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోసిగి మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ పాఠశాల, ఒక మోడల్ స్కూల్, 28 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నారు. ఈ ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు 15274 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం మూడు విడతల్లో 57,133 పాఠ్య పుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల వారికి 67026 నోటు పుస్తకాలు, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 7139 బ్యాగులు వచ్చినట్లు తెలిపారు. నేటి నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందించాలని హెచ్ఎంలకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాషా, నరసయ్య, నరసింహులు, వెంకటేష్, సీఆర్‌పీలు ఉసేని, యేహాన్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ నరేంద్ర, సిబ్బంది వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి–2 మధుసూదన్‌రాజు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు మొత్తం 66,974 పుస్తకాలు, 8 నుంచి 10వ తరగతి వరకు 79,323 పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే బ్యాగులు 21,949, బెల్టులు 15,576, నోట్ బుక్స్ 1,22,984 అందచేశామని, బూట్లు మండలానికి ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### పోషకాలతోనే ఆరోగ్యం

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమే గాకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కాన్పులు ప్రభుత్వ వైద్యశాలలో చేసుకోవడం సురక్షితే కాకుండా ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.

### డీటీఎఫ్ నాయకులకు సన్మానం



డీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: డీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల్లో పదవులు పొందిన స్థానిక నాయకులను బుధవారం ఆ సంఘ కార్యాలయంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కరె కృష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా గట్టు తిమ్మప్పతో పాటు జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.వీరన్న, అధ్యక్షులుగా విజి.వెంకట్రాముడులను విజయవాడలోని ఎన్జీఓ హోమ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు రామన్న, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. డీటీఎఫ్‌లో 25 సంవత్సరాలుగా విశేష సేవలందించిన స్థానికులైన వారికి రాష్ట్ర, జిల్లా పదవులు అలంకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాలు, పుష్పగుచ్ఛాలిచ్చి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు గోట్ల చంద్రశేఖర్, మోహన్, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటేశప్ప, గంగాధర్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జడ్జి కుమారి అర్చన

ఆదోని రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదోని ప్రిన్సిపల్ జడ్జి కుమారి అర్చన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా బాగా చదివించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని వివరించారు. మైనర్ పిల్లలను పనులకు పంపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలకార్మిక చట్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. చీటికిమాటికి తల్లిదండ్రులు గొడవలు పడితే ఆ ప్రభావం పిల్లలపై పడుతుందన్నారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శివకుమార్ స్వామి, కళ్యాణ్ రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



పత్తి పొలంలో దంతె పాస్తున్న అన్నదాతలు



ముగతిలో పంట పొలంలో చద్దులు ఆరగిస్తున్న వ్యవసాయ కూలీలు

## ఊపందుకున్న వ్యవసాయ పనులు

నందవరం: వానల రాకతో పుడమితల్లి పులకరించిన వేళ. ఓ వైపు హలాల సవ్వడి.. మరోవైపు కర్షకుల సందడితో వ్యవసాయ భూముల్లో కోలహలం నెలకొంది. గ్రామగ్రామాన పొలం పనుల్లో రైతులు.. కలుపు తీసే పనుల్లో కూలీలు బిజీబిజీగా గడుపుతున్నారు. నిన్నటివరకు వెలవెలబోయిన పొలాలు నేడు కాడెద్దులు, కర్షకులతో దర్శనమిస్తున్నాయి. ముందస్తు పత్తి విత్తనం వేసిన పొలాల్లో సేద్యపు సవ్వడి కనిపిస్తోంది. నందవరం మండల పరిధిలోని నదితీర గ్రామాలు నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, బోర్లు, బోరు బావుల గ్రామాలు కనకవీడు, ఇబ్రహీంపురం, మాచాపురం, పూలచింత, నందవరం, టి.సోమలగూడూరు, పోనకలదిన్నె గ్రామాల్లో కూలీలు, కాడెద్దుల సవ్వడి కనువిందు చేస్తోంది.



పూలచింతలో కంది విత్తులో గుంటకలు పాస్తున్న రైతులు



పత్తి పొలంలో కలుపు మొక్కలను తొలగిస్తున్న కూలీలు

## కౌతాళంలో జోరు వాన

మండల కేంద్రంలో బుధవారం ఉదయం జోరు వాన కురువడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా మోస్తరు నుంచి కుండపోత వర్షాలు కురవడంతో రైతులు ఇప్పటికే దాదాపు 70 శాతం వరకు విత్తనం నాటే పనులు పూర్తి చేశారు. నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తుండంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు తమ పంట పొలాలను దుక్కి దున్ని పంటల సాగు చేపట్టారు. అధికంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈసారి ముందస్తు వర్షాలు కురవడంతో పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతున్నలు ఆశాభావంతో ఉన్నారు. కౌతాళంలో ఉదయం కురిసిన వానకు వైఎస్సార్ సర్కిల్ ఏరియాలో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. అలాగే వైఎస్సార్ నగర్, జేకేఎల్ఎస్ నగర్‌లో వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. – కౌతాళం



కౌతాళంలో కురుస్తున్న వాన



జేకేఎల్ఎస్ నగర్‌లో వీధిలో నిలిచిన వర్షపునీరు